# అవమానం

మా క్లాసులో అందటి కంటె, అన్నిటిలోను వెనకబడి వున్నవాడిని నేనే. క్లాసులో అందటికంటె వెనుక కూర్చుండే వాడిని. ఒక్కరోజైనా సుబ్బయ్య శాస్త్రిగారితో దెబ్బలుతినని పాపానపోలేదు. ఏ రోజు నాయెక్కాలు, పాఠాలు ఒప్పగించేవాడిని కాదు.

ఒకరోజున లెఖ్ఖలమాష్టారు పది లెక్కలు హోంవర్కు యిచ్చారు. తెలుగు మాష్టారు నాలుగు పద్యాలు ఒప్పజెప్ప మన్నారు. మరునాడు బడికి వెళ్లాను. లెక్కల మాష్టారు యిచ్చిన లెక్కలూ చేయలేదు. తెలుగు పద్యాలూ రాలేదు. లెక్కల మేష్టారు వచ్చారు. లెక్కలు నేను చేయలేదండీ అని ఖచ్చితంగా చెప్పివేశాను. బెత్తంతో ఒక అరడజను వడ్డించి యివాల్టివి, నిన్నటివి, రేపు చూపించు అని మళ్లీ పది లెక్కలు హోంవర్కు యిచ్చారు.

రోజు రోజుకు తిట్లు, దెబ్బలు యెక్కువై పోతున్నవి. చేయవలసిన లెక్కలుకూడా యెక్కువై పోతున్నవి. బడికి వెళ్లకపోతే నాన్నగారు కొడుతున్నారు. బడిలోకెళ్లితే మేష్టారు కొడుతున్నారు. ఒకరోజున మేష్టారు "రేపు లెక్కలు చేసుకొనివస్తేనే బడిలోకి రా. లేకపోతే రావద్దు" అని గట్టిగా చెప్పివేశారు. నాగుండె ఝల్లుమన్నది. నాకేమీ వుపాయము తోచలేదు. నా స్నేహితుడు సోముదగ్గటికి వెళ్లి యేదైనా వుపాయము చెప్పమన్నాను.

సోము యిటువంటి వుపాయాలు చెప్పటంలోను, కొంటె పనులు చేయుటంలోను చాల నేర్పరి. కనుక వెంటనే "దీనికేముందిరా! కాలులో గాజుపెంకు దిగిందని యెవ్వరికీ తెలియకుండ కాలుకు కట్టుగట్టి మంచంమీద మూలుగుతూ పడుకునేదానికి" అన్నాడు యేమీ ఆలోచించకుండా.

బి. వెంకటరత్నం చౌదరి

మంచి వుపాయం చెప్పాడని సంతోషిస్తూ నేను యింటికి జేరాను. ఆ సాయంత్రమే కాలుకు కట్టుకట్టి పడుకొని మూలగడము ప్రారంభించాను. మా నాన్నగారు వచ్చి యేమిటిరా అని అడిగితే "కాలులో గాజుపెంకు గుచ్చుకుం" దన్నాను. 'ఏదీ చూద్దా'మంటూ కట్టు విప్పబోయారు. 'బాబోయ్! నొప్పి'అంటూ కట్టు విప్పకుండా కాలు లాగేసుకున్నాను. భోజనానికి వెళ్లవలసివస్తే కట్టువున్న కాలు కుంటుకుంటూ వెళ్లేవాడిని. ఇట్లా రెండు రోజులు బడిలోకి వెళ్లకుండా, కట్టు విప్పకుండా జరిపేశాను.

మూడవరోజున కూడా మూలుగుతూ పడుకున్నాను. దురదృష్టవశాత్తు నిద్ర పట్టేసింది. గాజుపెంకు యెంతలోతు దిగిందో చూద్దామని మా నాన్నగారు మెల్లిగా కట్టు విప్పారు. చూస్తే గాయమూ లేదు, ఏమీ లేదు. వెంటనే యెడమ కాలుకుకట్టిన కట్టు విప్పి కుడి కాలుకు కట్టి యేమీ యెఱుగనట్లు వూరుకున్నారు.

నేను కొంత సేపటికి లేచాను. కాని కాలికట్టు మారినసంగతి గమనించలేదు. మా అమ్మ భోజనానికి పిలిచింది. నేను యెప్పటివలెనే కట్టువున్న కాలు కుంటుతూ భోజనానికి వెళుతున్నాను. మా నాన్నగారు నవ్వుతూ "ఏరా అబ్బాయి! నిన్న యెడమకాలుకు కట్టుగట్టి యెడమ కాలు కుంటావు. ఇవాళకట్టు కుడి కాలికిమార్చి, కుడికాలు కుంటుతున్నావేరా?" అన్నారు.

జరిగినది గ్రహించాను. నా నోట మాటరాలేదు. 'బడిమానటానికి వేశావా యెత్తు'అని గట్టిగా మందలించి, అప్పటినుంచీ కట్టుదిట్టముగా ప్రైవేటు చెప్పించారు. నాటి అవమానముతో నాబుద్ధి మారింది. నాటినుంచీ శ్రద్ధగా చదివి, ఒక్క క్లాసైనా తప్పకుండా యిప్పుడు థర్డ్ ఫారం చదువుతున్నాను.